క్లుప్తంగా

జవాబుదారీతనంగా పనిచేయాలి

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటుగా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహశీల్దార్ కె.నాసరయ్య సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతు రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండలస్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి త్వరగా పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల వారీగా పెండింగ్ అర్జీలపై విచారించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్లోరినేషన్ నీరు అందించేందుకు చర్యలు

చీరాల టౌన్: వర్షాలు కురుస్తున్నాయి.. ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో పాటుగా ప్రజలకు క్లోరినేషన్ చేసిన మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ సెక్రటరీ మురళీబాపూజీ సూచించారు. శుక్రవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయితీలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును క్లోరినేషన్ చేయించడంతో పాటుగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించారు. అలానే గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈసందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించి ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించేందుకు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

చీరాల టౌన్: ఉపాధి హామీ పథకంలో ఉన్న ఉపాధి కూలీలు అందరికి పనులు కల్పించాలని ఎంపీడీవో శోభారాణి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏంపీడీవో మాట్లాడుతూ చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 11 గ్రామ పంచాయితీల్లో ఉన్న ఉపాధి కూలీలు అందరికి పనులు కల్పించాలని సూచించారు. పనులను ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు కల్పించడంతో పాటు పనిప్రదేశంలో మంచినీటి, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలు అందరి వివరాలను జాబ్‌కార్డులతో పాటుగా మస్టర్లులో నమోదు చేయాలన్నారు. కూలీలకు కూలీ డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీఏ, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో పనుల పరిశీలన



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న ఎంఈవో సుధాకర్

అద్దంకి: చేతుల పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చని ఎంఈవో టూ బీ సుధాకర్ అన్నారు. ఆయన స్టాప్ డయేరియా కార్యక్రమంలో పాల్గొన్నారు. దానిలో భాగంగా శుక్రవారం మండలంలోని తిమ్మాయపాలెం (ఏఏ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతల పరిశుభ్రత ఎలా చేసుకోవాలని, దాని వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలియజేశారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీ గంగాధర్, ఎంఈవో రమణారెడ్డి, ఏఎస్ఎం భారతి, సుధీష్ణకుమారి, క్లస్టర్ ఎం రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఆషాఢ మాసం, పునర్వసు నక్షత్రం, పాఢ్యమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పడకేసిన పారిశుధ్యం ..

మంచం పట్టిన పల్లెలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న దాసరి కల్యాణ్

- మురుగు మయంగా గ్రామాలు
- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఎక్కడి మురుగు అక్కడే, మంచం పట్టిన పల్లెలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు



పెదఅంబడిపూడిలో రోడ్డుపై మురుగునీరు



పెదఅంబడిపూడిలో సైడు కాల్వల్లో ముందుకు కదలని మురుగు



మల్లాయపాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బల్లికురవ:

కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు కావస్తున్నా గ్రామాల్లో పారిశుధ్యం మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. రోజురోజుకీ చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయే తప్పా వాటిని తొలిగించడం లేదు. వర్షాల సీజన్ ఆరంభంతో గ్రామాల్లోని మురుగు మందుకు కదలటంలేదు. ఎక్కడి మురుగు అక్కడే నిల్వతో పాటు సైడు కాల్వల్లో పూడిక చేరటంతో మురుగు నీరు రోడ్డుపై గుండానే ప్రవహిస్తోంది. మురుగు నిల్వలతో పగలు, రాత్రి తేడా లేకుండ దాడి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రవర్తిస్తుండటంతో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది.

దోమల దాడితో రోగాలు క్యూ..

మురుగునిల్వలు, దోమల దాడితో మండలంలోని పెదఅంబడిపూడి, చిన అంబడిపూడి, పాతమల్లాయ పాలెం, యానాది సంగం, సోమవరప్పాడు, వేమవరం, జమ్ములమడక కాలనీలు బల్లికురవలోని తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ముందు పారిశుధ్య లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెదఅంబడిపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో అపరిశుద్ధ్యంతో 20 రోజులుగా టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా జ్వరాలతో సుమారు 40 మంది వరకు వైద్యశాలల చుట్టూ తిరుగుతున్నారు. సోమవరప్పాడులో ఇదే పరిస్థితి వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నా జ్వరాలు అదుపులోకి రాలేదు. అంబడిపూడి గ్రామాన్ని ఎంపీడీవో హనుమారెడ్డి, గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్, మార్టూరు మలేరియా సబ్‌యూనిట్ అధికారి శేషగిరిరావు పరిశీలించారు. గ్రామంలో సురక్షిత మంచి నీటిని శాంపిల్స్ తీసుకుని ల్యాబ్ పరీక్షలకు పంపారు. తక్షణమే పై గ్రామాల్లో మురుగు తొలగింపుతో పాటు దోమలకు చెక్ పెట్టేందుకు ఫాగింగ్ చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి..



పెద అంబడిపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురుగు నిల్వలు, దోమలతో 20 రోజులుగా వైద్యశాలల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. పారిశధ్య కార్యక్రమాలకు స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టి ఇబ్బందులు తొలగించాలన్నారు. వారం రోజులపాటు ప్రతిరోజు ఫాగింగ్ చేపట్టాలి.

– టి. శ్రీనివాసరావు, పెదఅంబడిపూడి

మురుగునీటి నుంచి విముక్తి కల్పించాలి..



సైడు కాల్వల్లో వ్యర్థాలు చేరటంతో మురుగునీరు ముందుకు కదలటంలేదు. రోడ్లపైనే ప్రవహిస్తున్నాయి. దోమల విజృంభనతో నిత్యం జగారాలు తప్పటంలేదు. సైడుకాల్వల్లో వ్యర్థాలు తొలగింపుతో మురుగునీరు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలి.

– బండి సుబ్బాయమ్మ.

పరిశుభ్రతతో రోగాలు దూరం



కారంచేడులో డయేరియాపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ, వైద్య సిబ్బంది



పెద అంబడిపూడిలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కారంచేడు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో విపరీతంగా ప్రబలుతున్న అతిసార వ్యాధిని తరిమికొట్టేలా ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రం కారంచేడు అంబేద్కర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అతిసార వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. ప్రజల్లో చైతన్యం కల్పించేలా అవగాన ర్యాలీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బంది, ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడుతూ అతిసార వ్యాధి అంటే ఏమిటి, దీనిని ఎలా నివారించుకోవాలో తెలియజేశారు. చిన్న బిడ్డలకు ఒక రోజులో మూడు సార్లు అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరేచనాలు అయితే దీనిని అతిసార వ్యాధి లక్షణంగా చూడాలన్నారు. దీని నుంచి ఉపసమనం పొందేందుకు ఓఆర్ఎస్, విటమిన్ ఏ సిరప్‌ను తాగించాలన్నారు. స్వచ్ఛమైన తాగు నీటిని ఉపయోగించాలన్నారు. భోజనానిని ముందు, మరుగుదొడ్లు వినియోగించిన తరువాత తప్పకుండా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. తల్లిపాలు తాగకపోవడం, ప్రతిదీ వాంతి చేసుకోవడం, పలుచని మల విసర్జన తరువాత నిర్జలీకరణ, అనారోగ్యానికి గురవ్వడం, మలంలో రక్తం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అతిసార వ్యాధిపై ప్రధానంగా లోతట్టు ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కారంచేడు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు, జగదీశ్వరి, రాణి, భవానీ, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసారను నివారిద్దాం..

బల్లికురవ: ప్రభుత్వం డయేరియాను సమూలంగా నిర్మూలించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఆగస్టు 31 వరకు చేపట్టిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికార్లు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ, మలేరియా, మార్టూరు, సబ్‌యూనిట్ అధికారి శేషగిరిరావు అన్నారు. శుక్రవారం పెద అంబడిపూడి, సోమవరప్పాడు, గ్రామాల్లో డయేరియా, చేతుల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులకు జింక్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సురక్షిత మంచినీటిని తాగుతూ వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. అనారోగ్యంతో అస్వస్థతకు గురైతే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

నాణ్యమైన విద్యతో మంచి ఫలితాలు



మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి

చినగంజాం (పర్చూరు): విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట కావాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ అన్నారు. వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న ఎడ్యుకేషన్ టూల్స్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. సీనియర్ ఉపాధ్యాయులకు మాస్టర్ ట్రైనర్స్ ఇస్తున్న శిక్షణను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో ఉపాధ్యాయులు సున్నితత్వాన్ని పాటించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థి దశకు వెళ్లి బోధన చేస్తే మంచి ఫలితాలను రాబట్టవచ్చని తెలిపారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ గుర్తుండి పోయేలా వివిధ రకాల పరికరాలను ఉపయోగించి విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటరామయ్య, మాస్టర్ ట్రైనర్లు మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, గుమ్మా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చీరాల అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతగా తీసుకోవాలని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ పి.సాయిపావని అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని నారాయణ స్కూల్ ఆధ్వర్యంలో ప్రకృతి పోషణ-పరిరక్షణ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని పరిరక్షించండి అనే నినాదాలతో విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. చీరాల గడియార స్తంభం సెంటర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తూ మానవహారం చేశారు. ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎం.శ్రీనివాస్, జోనల్ కో-ఆర్డినేటర్ మోహిని, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలోనే వ్యర్థాలు, మందు సీసాలు



కొణిదెన ప్రాథమిక పాఠశాల

బల్లికురవ: పవిత్రం దేవాలయంగా భావించే పాఠశాలలోనే వ్యర్థాలు మందు సీసాలు పడేయటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఒకటి -రెండు తరగతుల్లో సుమారు 16 మంది విద్యార్థులు చదవుకుంటున్నారు. ఇరువురు ఉపాధ్యాయులు పనిచేస్తుండగా పని సర్దుబాటులో భాగంగా ఓ ఉపాధ్యాయురాల్ని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపారు. నాడు-నేడులో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం ముందే ప్రతి రోజు వ్యర్థాలు విసరటం బాధ కల్గిస్తుందని ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం తెలిపారు. కాలనీ వాసులకు అనేకసార్లు చెప్పామన్నారు. వ్యర్థాలు, మద్యం బాటిళ్లను ప్రతిరోజు శుభ్రం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.



పాఠశాలలో వేసిన వ్యర్థాలు, మందుబాటిళ్లు

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో చిటిపోతు వంశస్థుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతి శుక్రవాకం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ హెల్ప్ వైద్యశాలచే నిర్వహించే ఈ శిబిరంలో ఆయాసం, గుండెదడ, గుండె నొప్పి, గుండె బరువుగా ఉండటం, తల తిరగటం, ఎడమచేయి లాగటం, ఎంతోకాలంగా షుగరు, బీపి ఉన్నవారికి అత్యంత ఖరీదైన గుండె స్కానింగ్, ఈసీజీ, 2 డీఎకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. చిటిపోతు మస్తానయ్య, నాసరయ్య, బ్రహ్మనందం, వాసు, అమర్నేని భాస్కరరావుచే ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని సర్పంచ్ వివరించారు. ఉప్పుమాగులూరుతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రీయ సమాజంతోనే దేశాభివృద్ధి



సత్తార్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జేవీవీ, యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: ఆధునిక ప్రపంచంలో టెక్నాలజీతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికి మూఢనమ్మకాలకు మాత్ర ప్రజలు బలైపోతున్నారని.. వాటి బారిన ప్రజలు పడకుండా వారికి కాపాడాలంటే శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు ఏవీ పుల్లారావు అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన జేవీవీ, యూటీఎఫ్ నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లో బాబా కాలి ధూళి కోసం సుమారు 200 మంది చనిపోవడం బాధాకరమన్నారు. అశాస్త్రీయ భావాలు ప్రజల్లో లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇలాంటి మూఢనమ్మకాలకు అమాయకులు బలికాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన చట్టాలను రూపొందించి మూఢనమ్మకాల నుంచి ప్రజలను కాపాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా గురించి, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా చూడాలన్నారు. అలానే ఉపాధ్యాయులు విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచలను అభివృద్ధి చేయాలన్నారు. యూటీఎఫ్ నాయకులు సత్తార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కుర్రా రామారావు, బి.పిచ్చయ్య, యూటీఎఫ్ నాయకులు బిక్షాలు, జి.సూరిబాబు, కె.వీరాంజనేయులు, కుర్రా శ్రీను, పాలేటి సురేష్, జాగర్లమూడి వెంకటేశ్వర్లు, రాజేష్, వెలిగొండరెడ్డి, షేక్ జానీ పాల్గొన్నారు.

ఆదిపూడి రోడ్డంతా గుంతలే..!



గుంతలమయంగా మారిన కారంచేడు-ఆదిపూడి రోడ్డు రహదారి

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడుకు రావాలంటే నరకం కనిపిస్తుందని, రహదారి గుంతలమయంగా మారిందని ఆదిపూడి, యర్రవారిపాలెం వాసులు వాపోతున్నారు. గత నెలలో కురిసిన అకాల వర్షాలతో కారంచేడు-ఆదిపూడి, యర్రంవారిపాలెం, నూతలపాడు గ్రామాలను అనుసంధానం చేసే రహదారితో పాటు, ఆదిపూడి-యర్రంవారిపాలెం గ్రామాల మధ్యన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారిందని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పైగ్రామాల నుంచి మండల కేంద్రమైన కారంచేడుతో పాటు, చీరాల ప్రాంతాలకు ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు లబోదిబోమంటున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకంను తలపిస్తుందన్నారు. గుంతల రోడ్డులో కొద్దిపాటి వర్షం కురిసినా, రాత్రి సమయాల్లోను ప్రయాణం మరీ ఇబ్బందిగా ఉంటుందన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పై గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంజన్నకు దశసహస్ర కదలీఫలార్చన



అరటిపండ్ల పూజలో ఆంజనేయస్వామి

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి అమావాస్య సందర్భంగా శుక్రవారం దశ సహస్ర (పదివేల అరటి పండ్లు)తో అర్చన చేశారు. కార్యక్రమాన్ని ఏసీ సుభద్ర పర్యవేక్షించారు. దానిలో భాగంగా ప్రాతఃకాల అర్చన, బందెతీర్థం, అభిషేకం, గోపూజ, ప్రత్యేక అలకంరణ చేశారు. ఉభయ దాతలతో వేదస్వస్తి, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, జీవధ్వజ, ఉష్ణ (ఒంటె) వాహనానికి ప్రత్యేక పూజ చేశారు. తరువాత గణపతి, సుబ్రహ్మణ్య స్వామి పూజ, 11 వరుసలలో 10వేల అరటిపండ్లతో పూజ చేశారు. పంచహారతులు, మహానివేదన అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉభయదాతలు ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఏసీ పర్యవేక్షించారు.